క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కందిపప్పును పరిశీలిస్తున్న మార్కెటింగ్ ఆఫీసర్ రవికిరణ్

విజయనగరం ఫోర్ట్: సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ అగ్రిటిడ్ మార్కెటింగ్ ఆఫీసర్ బి.రవికిరణ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ రైతుబజార్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్న ప్రత్యేక కౌంటర్లను పరిశీలించి, సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి చప్ప సతీష్,తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి



అవనాపు భావన

విజయనగరం: ప్రశాంతతకు మారుపేరైన విజయనగరం జిల్లాలో ఆరు నెలల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ అవనాపు భావన డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తోటమ్మ చెరువుగెడ్డ ఆక్రమణ



ఆక్రమణకు గురైన తోటమ్మ చెరువుగెడ్డ

భోగాపురం: మండలంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. దల్లిపేట రెవెన్యూ పరిధి రాళ్లపాలెం వెళ్లే రహదారి పక్కన సర్వే నంబర్ 231లో ఉన్న సుమారు 40 సెంట్ల తోటమ్మ చెరువు గెడ్డ ఆక్రమణకు గురైందని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని వీఆర్‌ఓ వాసుదేవి వద్ద ప్రస్తావించగా గెడ్డను పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థిని తండ్రికి నగదు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం: పేద ఆర్యవైశ్య విద్యార్థులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా ఆర్యవైశ్య చారిటీ గ్రూప్ అధ్యక్షుడు ఎ.శేఖర్ అన్నారు. సోమవారం స్థానిక చారిటీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, వివాహ సమయాల్లో అర్హులకు సాయమందిస్తామన్నారు. అనంతరం వరదా శ్రీనివాసరావు కుమార్తె వరదా కామేశ్వరికి ఉన్నత చదువులు చదివేందుకు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మారు రథయాత్ర



రథం వద్ద బారులు తీరిన భక్తులు

విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మారు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. సంతపేట జగన్నాథుని రథాన్ని కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అదేవిధంగా దాసన్నపేటలో కొలువైన స్వామివారికి మూడు కోవెళ్ల వద్ద, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి, తరించారు.

నేడు లోక్‌అదాలత్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామంలో మంగళవారం లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు బాబూ...!

- అధికారంలోకి వచ్చి నెల దాటినా చర్యలు శూన్యం
- నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది నిరుద్యోగులు
- ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపులు



పూసపాటిరేగ/నెల్లిమర్ల రూరల్: నిరుద్యోగుల ఆశలపై నూతన సర్కారు నీళ్లు చల్లుతోంది. ప్రభుత్వం ఏర్పడి నెల దాటుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ఊసెత్తడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్ల పాలనలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అంతవరకు నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు చొప్పున భృతి అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు గుప్పించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పూసపాటిరేగ మండలంలో 5200, డెంకాడ మండలంలో 4800, భోగాపురం మండలంలో 4670, నెల్లిమర్ల మండలంలో 5100 మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండు నెలలు మాత్రమే భృతి ఇచ్చి ఆ పథకానికి మంగళం పాడారు. తిరిగి 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారం వచ్చి నెల రోజులు దాటుతున్నా నిరుద్యోగ భృతి గురించి పట్టించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. భృతి ఇస్తే పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవచ్చనే ఆశతో చాలా మంది ఉన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయాలని కోరుతున్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి



ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ఎన్నికలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం లేని నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా నిరుద్యోగ భృతిపై కనీసం పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలి.

– నల్లపొత్రుని పుష్ప, రాజావీధి, పూసపాటిరేగ

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతిని వెంటనే బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలి. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నిరుద్యోగులను ఆదుకోవాలి.

– సంచాన గౌరి, నిరుద్యోగి, భూడివీధి పూసపాటిరేగ

మాట నిలబెట్టుకోవాలి



నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. భృతి వస్తే కనీసం పోటీ పరీక్షలకు ప్రిపేరవడానికి వీలుంటుంది. కూటమి నాయకుల మాటలు నమ్మి నిరుద్యోగులు, యువత అండగా నిలిచింది. అధికారం చేపట్టి నెల రోజులు దాటుతున్నా భృతి మంజూరు చేయకపోవడం సబబు కాదు.

– రమణమ్మ, నిరుద్యోగి, పూసపాటిరేగ

2014లో మోసం చేశారు



చంద్రబాబు చేతిలో 2014లో ఒకసారి మోసపోయాం. అప్పుడు కూడా రెండు వేల రూపాయల భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారు. మళ్లీ 2024లో హామీ ఇచ్చారు. కనీసం ఈ సారైనా హామీ నిలబెట్టుకుని నిరుద్యోగులను ఆదుకోవాలి. ఇప్పటికే నెల రోజులు దాటింది. త్వరతగతిన విధి విధానాలు ప్రకటించాలి.

– అల్తి మాధవరావు, తమ్మాపురం గ్రామం, నెల్లిమర్ల మండలం

మాట నిలబెట్టుకోవాలి..



కూటమి నాయకులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున భృతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు అధికారంలో ఉన్నది వారే కాబట్టి, వెంటనే భృతి అందించాలి. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా అర్హులందరికీ భృతి అందించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.

– బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, నెల్లిమర్ల నియోజకవర్గం

ఘనంగా అవనాపు జయంతి



గొడుగులు పంపిణీ చేస్తున్న అవనాపు విక్రమ్, భావన

విజయనగరం: మున్సిపల్ మాజీ చైర్మన్, దివంగత అవనాపు సూరిబాబు 74వ జయంతి విజయనగరం పట్టణంలోని పుచ్చలవీధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అవనాపు విక్రమ్, అవనాపు భావన, తదితరులు సూరిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూరిబాబు చేసిన సేవా కార్యక్రమాలను, అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్, భావన దంపతుల చేతుల మీదుగా సూరిబాబు జ్ఞాపకార్థ గొడుగులు పంపిణీ చేశారు. నాగవంశ సంక్షేమ సంఘానికి సుమారు 6 లక్షల 50 వేల రూపాయలతో సమకూర్చిన అంతిమయాత్ర వాహనాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాగవంశ కులపెద్దలు, యువత, స్థానిక పెద్దలు, అవనాపు అభిమానులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో మాట్లాడుతున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: జర్నలిస్టులు చట్టబద్ధంగా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసుకున్న స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆక్రమణలపై గత కలెక్టర్ విచారణకు ఆదేశించారని, అయినప్పటికీ ఆలస్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అక్రిడేషన్ ఉన్న వారందరికీ ఆహ్వానంతో పాటు వివరాలు తెలియజేయాలని కోరారు. హెల్త్ ఇన్సూరెన్స్‌ను అక్రిడేట్, నాన్ అక్రిడేట్ జర్నలిస్టులందరికీ వర్తింపచేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, పంచాది అప్పారావు, రాధాకృష్ణ, వీఎస్ఎన్ కుమార్, వైఎస్ పంతులు, నాగరాజు, విజయభాస్కర్, దేవిడ్‌రాజు, శంకరరావు తదితరులున్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



అర్జున అవార్డుగ్రహీత నీలంశెట్టి లక్ష్మిని సన్మానిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

- సెంచూరియన్ చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చాన్స్‌లర్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజూ రెండు గంటలు క్రీడలకు కేటాయిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. వీసీ పీకే మహంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు సమయం దొరికితే ఫోన్లకు అతుక్కుపోతున్నారని, అలా కాకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో వెయిట్ లిఫ్టింగ్ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, అంతర్జాతీయ రిఫరీ రత్నాకరరావు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినతుల స్వీకారం



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 14 వినతులు వచ్చాయి. వినతులు స్వీకరించిన కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, శానిటేషన్‌కు సంబంధించి 2, హౌసింగ్‌కు సంబంధించి ఒక వినతి అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ అమ్మాజీరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి కఠిన చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

డెంకాడ: పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా కఠిన చట్టాలు అందుబాటులోకి వచ్చాయని తహసీల్దార్ రామారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామారావు, భోగాపురం క్లస్టర్ సీడీపీఓ ఎస్తేరురాణి మాట్లాడుతూ, 2013లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం తీసువచ్చారన్నారు. ఈ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జగన్నాథం, ఇన్‌చార్జ్ ఎంఈఓ వి.శ్రీరాం, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఐసీడీఎస్ సూపవైజర్లు ఎ.సత్యవతి, పి.శైలజారాణి, తదితరులు పాల్గొన్నారు.

కందాలకు ఘన నివాళులు



విద్యార్థులకు ప్రశంసాపత్రం, స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం: నిరాడంబరతకు ప్రతిరూపమైన మాజీ ఎంపీ కందాల సుబ్రహ్మణ్య జీవితాన్ని నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు సూచించారు. సోమవారం స్థానిక కంటోన్మెంట్‌లో కందాల 104 జయంతి ఘనంగా నిర్వహించారు. తిలక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా తిలక్ ఫౌండేషన్ సమకూర్చిన స్కాలర్‌షిప్‌లను ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వివిధ సేవా రంగాలలో పనిచేస్తున్న వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేఎస్ తిలక్ తమ తాతగారైన పీవీజీ రాజుకు సమకాలీకులన్నారు. సోషలిస్ట్ పార్టీ నేతగా అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన తిలక్ నీతి, నిజాయితీలకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. తిలక్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్‌వీఆర్ఎం రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి కందాళ సాయిబాబా, కోశాధికారి కేవీ రామకృష్ణ, కో ఆర్డినేటర్ కొత్తలి ఎర్నాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు అట్టాడ హేమసుందర్, కోట్ల సుగుణాకరరావు, గుమ్మలూరి విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

భోగాపురం: మండలంలోని సవరవిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్త శాంతకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రం తలుపుల గొళ్లాన్ని తప్పించి టేబుల్ ఫ్యాన్, గ్యాస్ సిలిండర్‌తో పాటు 261 గుడ్లను దొంగిలించుకుపోయారు. ఆదివారం సెలవు కావడంతో కేంద్రం తెరవలేదు. సోమవారం ఉదయం కేంద్రాన్ని తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, మహిళా పోలీస్ త్రివేణికి సమాచారం అందించినట్లు కార్యకర్త శాంతకుమారి తెలిపారు. ఇదిలా ఉంటే దొంగతనం చేసిన వ్యక్తులు అదే గ్రామంలో గ్రామంలో నివాసముంటున్న ఒక మహిళకు గ్యాస్ సిలిండర్ అమ్మినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రంలో దొంగతనం జరిగిదంటూ ఫిర్యాదు వచ్చిందని, దీనిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

స్వర్గధామం సమస్యలను పరిష్కరించండి..



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చిక్కాల సాంబశివరావు, తదితరులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేట ప్రజలకు చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్వర్గధామానికి సంబంధించి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, శ్మశానం ఏర్పాటు చేసిన స్థలం ప్రభుత్వానిది కాగా.. సమీపంలోని ఓ మిల్లు యాజమాన్యం పెత్తనం చెలాయిస్తోందన్నారు. కార్యక్రమంలో చిక్కాల సంతోష్‌కుమార్, చిక్కాల సుమతి, మహంతి అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు, కారుకొండ హరీష్ పాల్గొన్నారు.

ఘనంగా యువ నైపుణ్య దినోత్సవం



ఎలక్ట్రికల్ పనిముట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున మాట్లాడుతూ.. యువతలోని నైపుణ్యాలను వెలికి తీయడం ద్వారానే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. అనంతరం సంస్థలోని ఎలక్ట్రికల్ శిక్షకుడు ఆర్.సురేష్‌ను ఘనంగా సత్కరించారు. శిక్షణ పొందిన 32 మందికి ఎలక్ట్రికల్ పనిముట్లను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అసోసియేషన్ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ కేవీ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

• డైట్‌లో 'మదర్ గార్డెన్'



మొక్కలు నాటుతున్న డైట్ సిబ్బంది

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో (డైట్) మదర్ గార్డెన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు ఆధ్వర్యంలో అమ్మపేరులో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం. రామకృష్ణరావు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం

1912కి కాల్ చేయండి

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధ్రువీకరణ పత్రం వంటి వివరాలను తెలియజేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.